కాలనీల సమస్యలు పరిష్కరించాలి



కూకట్‌పల్లి: నియోజకవర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్‌లు గురువారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జడ్సీ అపూర్వ చౌహాన్‌ను కలిసి ఆయా కాలనీల సమస్యలు వివరించారు. దీర్ఘకాలంగా ఉన్న వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు. అనంతరం నూతనంగా నియమితులైన డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, పండాల సతీష్ గౌడ్, సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, బాబూరావు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి



కార్యక్రమంలో పాల్గొన్న లెఫ్టినెంట్ సందీప్, హెచ్ఎం అరుణ తదితరులు

కూకట్‌పల్లి: విద్యార్థులు మంచి లక్షణాలను అలవర్చుకోవాలని పలువురు వక్తలు అన్నారు. రవీంద్రభారతి హైదర్‌నగర్ బ్రాంచ్‌లో గురువారం విద్యార్థుల నాయకత్వ పదవి స్వీకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వివేకానంద డిగ్రీ కాలేజీలోని ఎన్‌సీసీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ సిహెచ్. సందీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ విభాగాలలో నాయకులుగా ఎన్నికైన చిన్నారులకు పతకాలను అందజేశారు. అనంతరం విద్యార్థుల నాయకుడి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20న బోనాలు

బాలానగర్: బాలానగర్‌లోని ఫతేనగర్‌లోని జవహర్‌లాల్ కాలనీలోని కనకదుర్గాదేవి, శీతలా దేవి, కాళికాదేవి ఆలయంలో అమ్మవారి ఆషాఢ బోనాల పండుగను 20న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, ఆషాఢ మాసం సందర్భంగా శాకాంబరి అమ్మవారిగా పూలు, కూరగాయలతో అలంకరణ జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది.



అమ్మవారి పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు



గూడ్స్‌షెడ్ రోడ్డులోని ముత్యాలమ్మ తల్లి వద్ద బోనాలతో మహిళలు



నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బోనాల సంబురం

- అమ్మవార్లకు బోనాలు సమర్పించిన భక్తులు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు



ప్రత్యేక అలంకరణలో మహంకాళి, సరస్వతి అమ్మవార్లు

మూసాపేట: మూసాపేటలోని పలు ఆలయాల్లో గురువారం ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు బోనాలను డప్పు దరువుల మధ్య, పోతరాజుల, శివసత్తుల విన్యాసాల మధ్య అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బాబూరావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సత్యం శ్రీరంగం, నల్లపోచమ్మ తల్లి ఆలయ చైర్మన్ ఎల్లేష్‌యాదవ్, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవి నగర్‌లో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దేవి నగర్‌లో పోచమ్మ అమ్మవారి ఆషాఢ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు, కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, సతీష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో భవానీ నగర్‌లోని పోచమ్మ తల్లి



రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ పూజలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు



వర్షంలో తడుస్తూ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



పూజలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు తదితరులు



దేవినగర్‌లో పోచమ్మ తల్లి అమ్మవారి బోనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు



భవానీనగర్‌లో బోనాలతో మహిళా భక్తులు

నాగార్జున కాలనీలో రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదితరులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీలో ఎమ్మెల్యే సహకారంతో రూ.17 లక్షల నిధులతో రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ లోతట్టు ప్రాంతం కాబట్టి ఎత్తు పెంచి రోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుల సలావుద్దీన్, అస్లాం, సత్యనారాయణ యాదవ్, సతీష్, షఫీ, మాణిక్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు నిరంతర కృషి



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: ఆయా డివిజన్‌లలో వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్‌నగర్ ఈ బ్లాక్‌లో రూ.78 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఫ్దార్‌నగర్ ప్రాంతంలో రహదారి వసతి మెరుగుపడక ప్రజలు కొంత కాలంగా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. పలుమార్లు ప్రజలు ఈ సమస్యను విన్నవించారని, వారి విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన తక్షణమే స్పందించి నిధులను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్ సలీం, షేక్ రఫీక్, విక్రం, అక్బర్, కృష్ణ, జోగారావు, లోకేష్, వెంకట్ రమణ, శంకర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

155 మద్యం బాటిళ్లు సీజ్

– 600 వాహనాల తనిఖీ

దుండిగల్: దుండిగల్ పీఎస్ పరిధిలో గురువారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఆదేశానుసారం మేడ్చల్ జోన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీ పోచంపల్లి 120 గజాల్లో 230 మంది పోలీస్ సిబ్బంది ఇంటింటికీ తనిఖీలు నిర్వహించారు. మొత్తం 464 ఇళ్లల్లో తనిఖీలు చేయగా.. ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవించినట్లు గుర్తించారు. అదే విధంగా ముగ్గురు అనుమానితులు, ఇద్దరు రౌడీషీటర్లు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ దాడుల్లో 155 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మొత్తం 600 వాహనాలను తనిఖీలు చేశారు. పెండింగ్ చలాన్‌లు ఉన్న 357 మంది వాహనదారుల నుండి రూ.1,02,330 నగదును వసూలు చేయడంతో పాటు 42 మందిపై ట్రాఫిక్ కేసులు నమోదు చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 1939 మంది నివాసముంటున్నట్లు పోలీసులు తెలిపారు.



కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని రైతు బజార్‌లో గురువారం కూరగాయల కిలోకు ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట రూ.27, వంకాయ రూ.28, బెండకాయ రూ.55, పచ్చిమిర్చి రూ.75, బజ్జీమిర్చి రూ.70, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, క్యాబేజి రూ.18, బీన్సు రూ.65, క్యారెట్ రూ.37, గోబిపువ్వు రూ.30, దొండకాయ రూ.35, చిక్కుడు కాయ రూ.75, గోరు చిక్కుడు రూ.45, బీట్‌రూట్ రూ.28, క్యాప్సికం రూ.75, ఆలుగడ్డ రూ.24, కీరా రూ.23, దోసకాయ రూ.18, పొట్లకాయ రూ.18, ఉల్లిపొరక రూ.40, ఉల్లిగడ్డ రూ.24, మామిడికాయ రూ.15 ఉన్నాయి.

పార్కుల్లో సదుపాయాలు కల్పించాలి



పార్కును పరిశీలించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: డివిజన్‌లోని పార్కుల్లో సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. గురువారం డివిజన్ 6వ ఫేజ్‌లోని అంబేడ్కర్ పార్కు, శిల్ప అవెన్యూ వద్ద వాటర్ ట్యాంక్ పార్కు, బాడ్మింటన్ పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల అభ్యర్థన మేరకు మౌలిక సదుపాయాల విషయంలో ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదే విధంగా డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్‌కు స్థానికులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో డివిజన్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామన్నారు. ఎమ్మెల్యే కృషితో ప్రజలకు అవసరమైన పార్కులు, ఇండోర్ స్టేడియాలు మొదలైనవి నిర్మించుకున్నామని, కనీసం వాటి నిర్వహణ బాధ్యతలు కూడా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈ రంజిత్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శ్రీరామ్, ప్రసాద్, జగదీష్, నారాయణ రాజు, విజయ్‌కుమార్ చౌదరి, ఫణి, ఝాన్సీ, కృష్ణవేణి, సత్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

మోతీనగర్: పోచమ్మ, కనకదుర్గమ్మ ఆలయంలో 20న నిర్వహించే బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుందని తులసినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఠాగూర్ అంకిత్‌సింగ్ అన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ తులసినగర్‌లోని పోచమ్మ, కనకదుర్గమ్మ ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పల దామోదర్ నేత, ఆలయ చైర్మన్‌గా సురేందర్, వైస్ చైర్మన్‌గా కాట్రాజ్ కుమార్‌లను ఎన్నుకున్నారు. అదే విధంగా 25 మందితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆదివారం నిర్వహించే బోనాల కార్యక్రమాన్ని కమిటీ సూచనల మేరకు భక్తులు బోనాలను అమ్మవారికి సమర్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో పి. కిషన్ సింగ్, రంగా, కృష్ణ, వెంకటరమణ చారి మల్లేష్, లక్ష్మయ్య, సీనయ్య చారి తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసీ కోర్సులను యథావిధిగా కొనసాగించాలి

బాలానగర్: ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. వి. బాలకిష్టారెడ్డిని గురువారం ఆయన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ ఫార్మసీ సమస్యలపై జేఎన్‌టీయూహెచ్ జేఏసీ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఫార్మసీ కోర్సులను యథావిధిగా కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్ ప్రాంగణంలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు బల్గర్ సందీప్, యూనివర్సిటీ అధ్యక్షుడు అదిమల్ల పవన్ కుమార్, లీగల్ అడ్వైజర్ ధర్మా, శ్రీకాంత్, చేతన్, శివరాజ్, గణేష్, రాజేష్, పుష్కర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

భారీ వర్షం.. రోడ్లు జలమయం

- మోకాళ్ల లోతు నీళ్లు
- పొంగి ప్రవహించిన మురుగు
- స్తంభించిన రాకపోకలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో పలువురు వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కార్యాలయాలు మూసివేసే సమయం కావటంతో విద్యార్థులు, ఉద్యోగస్తులు వర్షంలోనే మోకాళ్ల లోతులో తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. పలు చోట్ల మ్యాన్ హోల్స్ పొంగి ప్రవహించాయి. మూసాపేట, కూకట్‌పల్లిలోని దేవి నగర్ తదితర ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా భక్తులు వర్షంలోనే తడుస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. కూకట్‌పల్లి, మూసాపేట, మోతీనగర్, బాలానగర్, కేపీహెచ్‌బీకాలనీ, ఆల్విన్‌కాలనీ, భాగ్యనగర్‌కాలనీ, హైదర్‌నగర్ వంటి తదితర ప్రాంతాల్లో పడిన భారీ వర్షానికి ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో అభివృద్ధిలో భాగంగా రోడ్లన్నీ తవ్వివేయటంతో చిత్తడిగా మారాయి.







ఇంటికి చేరుకుంటున్న విద్యార్థులు



మూసాపేటలో వర్షంలోనే బోనంతో కుటుంబ సభ్యులు

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో జీహెచ్ఎంసీ సిబ్బంది వర్షాకాల శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విరిగిపడిన చెట్లకొమ్మలు, నివాసల మధ్యలో, ఖాళీ ప్లాట్ల వద్ద ఇష్టారాజ్యంగా పడేసిన చెత్తా చెదారాన్ని స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తొలగించారు. జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, శానిటేషన్ విభాగం అధికారి జమీల్ ఆదేశాలతో శానిటేషన్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి



వివరాలు వెల్లడిస్తున్న ఖాజా షాజుద్దీన్ అసద్ పటేల్

ఆల్విన్‌కాలనీ: తప్పుడు పత్రాలతో అక్రమ నిర్మాణం చేపడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య బంధువు అంటూ బెదిరింపులకు పాల్పడుతున్న ఓ మహిళపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఖాజా షాజుద్దీన్ అసద్ పటేల్ అన్నారు. గురువారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని శంషీగూడ విలేజ్ సర్వే నంబర్ 57లో తన స్థలంలో సర్వే నంబర్ 32గా చూపెడుతూ తన స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్నదని తెలిపారు. పలుమార్లు తన స్థలాన్ని సర్వే చేయించటం కూడా జరిగిందన్నారు. రోశయ్య బంధువునంటూ మభ్యపెడుతూ ప్రశ్నించినవారిని బెదిరింపులకు గురిచేస్తుందన్నారు. ఐదంతస్తుల అక్రమ నిర్మాణం చేపడుతున్నదని తెలిపారు. న్యాయం జరగక పోవటంతో రోశయ్య కుటుంబ సభ్యులను కూడా తాను కలిసి విషయాన్ని వివరించినట్లు తెలిపాడు. శ్రీదేవి అనే మహిళ తమ బంధువే కాదని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.